సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం । 16 । జూన్ । 2023



ఉప్పు రైతుకు కాసుల పంట

ఉప్పు సాగులో రికార్డు స్థాయిలో దిగుబడి వచ్చింది. దీనికి తోడు గిట్టుబాటు ధర కూడా పెరగడంతో ఉప్పు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 8లో ▸



కాపు ద్రోహులతో దోస్తీనా?

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తన పద్ధతి మార్చుకోవాలని. లేకపోతే ఛీత్కారాలు తప్పవని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. 8లో ▸

18న బాస్కెట్‌బాల్ సెలెక్షన్స్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ జట్లను ఈనెల 18న ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాల ఆవరణలో ఎంపిక చేస్తామని అసోసియేషన్ నాయకులు తెలిపారు. 8లో ▸



న్యూస్‌రీల్

పోలీస్ ఆస్పత్రికి మందుల వితరణ



మందులు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణంలోని పోలీస్ వెల్ఫేర్ ఆస్పత్రికి మందులను పట్టణ మెడికల్ హోల్‌సేల్ అండ్ రిటైల్ అసోసియేషన్ల సహకారంతో జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ఎస్పీ యు.రవిప్రకాష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ భీమవరం పోలీస్ క్వార్టర్స్ వద్ద పోలీస్ కుటుంబాల సౌకర్యం కోసం పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ ఏర్పాటు చేశామన్నారు. ఆస్పత్రికి అవసరమైన రూ.40 వేల విలువైన జనరల్ మెడిసిన్‌ను అందించడం అభినందనీయమన్నారు. దిశా ఎస్సై జయలక్ష్మి, భీమవరం మెడికల్ అసోసియేషన్ నాయకులు ఆర్‌వీ సూర్యనారాయణరాజు, ఎ.చలపతి, ప్రసాద్‌రాజు, సుంకర కేశవ్, ఆర్‌ఐ వెంకట్రావు, విజ్ఞాన వేదిక అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్ల గౌరవ వేతనానికి దరఖాస్తులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆదాయం లేని కొత్త మసీదులకు అర్హులైన ఇమామ్‌లు, మౌజాన్లు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం ఇమామ్‌కు రూ.10 వేలు, మౌజానుకు రూ.5 వేలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ ఎస్‌ఎం బాషా ఖాద్రీ ఓ ప్రకటనలో కోరారు. ఫారం–1 దరఖాస్తుతో పాటు మసీదు పేరున బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, మసీదు అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి, ఇమామ్, మౌజాన్‌ల పాస్‌పోర్టు ఫొటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, మసీదు పేరున ఉన్న పాన్‌కార్డు లేకపోతే మసీదు అధ్యక్షుడు, కార్యదర్శి పేరున ఉన్న పాన్‌కార్డు, సెల్ నంబర్లు, మసీదు స్థల డాక్యుమెంట్ల జిరాక్స్ కాపీలు అందించాలని సూచించారు. డాక్యుమెంట్లు లేని వారు మసీదు పేరు రాసి హద్దులతో సర్వే నంబర్, విస్తీర్ణాన్ని ధ్రువపరుస్తూ గ్రామ కార్యదర్శి నుంచి సర్టిఫికెట్ తీసుకుని జతచేయాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 9866326616, 9059007867 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


సోమారామంలో సహస్ర ఘటాభిషేకం



సంపూర్ణ జలంలో స్వామివారు

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామ క్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమా సోమేశ్వర జనార్దన స్వామి ఆలయంలో (సోమారామం) గురువారం సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. గర్భగుడిలో సంపూర్ణంగా జలంలో స్వామివారు దర్శనమిచ్చారు.

షార్ట్‌టర్మ్ కోర్సులతో ఉపాధి



మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

ఉండి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న షార్ట్‌టర్మ్ కోర్సుల ద్వారా నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని స్కిల్ డెవలప్‌మెంట్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ కొప్పర్తి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ప్రభుత్వ ఐటీఐలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి శిక్షణా కార్యక్రమాలను ఎంత ఎక్కువగా చేపడితే అంతగా గ్రామీణ నిరుద్యోగ యువతకు, మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. షార్ట్‌టర్మ్ కోర్సులు నేర్చుకుంటే భవిష్యత్ బాగుంటుందని, వాటిపై ఎక్కువగా ప్రచారం చేయాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వాటిని చేరువ చేయాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ డిప్యూటీ అధికారులు పి.చంద్రమౌళి, పి.శాంతను, ఐటీఐ జిల్లా కన్వీనర్ వి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

చింతలపూడికి శుభతరుణం

- ఎత్తిపోతల పథకానికి నాబార్డు సాయం
- రూ.1,000 కోట్ల రుణానికి గ్రీన్‌సిగ్నల్
- ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ప్రతి బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపు
- 4.80 లక్షల ఎకరాల ఆయకట్టుకు మేలు



చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ, (ఇన్‌సెట్‌లో) తమ్మిలేరుపై నిర్మాణం పూర్తికావచ్చిన భారీ అక్విడెక్ట్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని మరింత వేగంగా పూర్తిచేయడానికి కార్యాచరణ సిద్ధమైంది. ఏటా రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం విడతల వారీగా నిధులు కేటాయిస్తోంది. అయితే పనులు ముమ్మరంగా సాగడానికి భారీగా నిధులు అవసరం ఉన్న నేపథ్యంలో జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డు)కు రుణ ప్రతిపాదన పెట్టగా ఆమోదం లభించింది. సుమారు రూ.1,000 కోట్ల రుణ మంజూరుకు నాబార్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో సాంకేతికపరమైన లాంఛనాలన్నీ పూర్తి చేసుకుని మరో రెండు నెలల్లో చింతలపూడి పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.

పనుల్లో పురోగతి

మెట్ట ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందించడంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం కీలకం కానుంది. 2003లో వైఎస్సార్ పాదయాత్ర నిర్వహించిన క్రమంలో ఇక్కడ ప్రజల కష్టాలను స్వయంగా చూసిన ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత చింతలపూడి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ఆయన మరణానంతరం వచ్చిన పాలకులు పథకాన్ని అటకెక్కించడంతో కొన్నేళ్ల క్రితం వరకూ ప్రాజెక్టు నిర్మాణం కలగానే మారింది. ఈ క్రమంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ప్రతి ఆర్థిక బడ్జెట్‌లో ప్రాజెక్టుకు నిధులు కేటాయించడంతో పాటు కోర్టు వివాదాలు, ఇతర సమస్యలపైన దృష్టి సారించి పనుల్లో పురోగతి తీసుకువచ్చింది. ఈ క్రమంలో 2022–23 ఆర్థిక బడ్జెట్‌లో రూ.487 కోట్లు, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.279 కోట్లు మంజూరు చేయడంతో పథకం కాలువల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. అయితే ప్రాజెక్టు పనులు మరింత వేగిరపర్చడానికి నాబార్డు నుంచి రుణం మంజూరుకు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. వాస్తవానికి 2020లోనే రుణ ప్రతిపాదన పంపినా బడ్జెట్ భారం అధికంగా ఉండటంతో సాధ్యం కాలేదు. మరలా ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదనలు సవరించి రూ.1,000 కోట్ల ప్రతిపాదనలతో నాబార్డుకు దరఖాస్తు చేయగా ఆమోదం లభించింది.

2008లో వైఎస్సార్ శ్రీకారం

చింతలపూడి ఎత్తిపోతల పథకానికి 2008 అక్టోబర్ 30న కామవరపుకోటలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి శంకుస్థాపన చేశారు. అప్పట్లో పనులు చురుగ్గా సాగగా ఆయన అకాల మరణంతో పథకం నిలిచిపోయింది. మరలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పథకాన్ని పూర్తి చేసి ఉమ్మడి పశ్చిమగోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలని సంకల్పించారు. పథకానికి 22,962 ఎకరాల భూమి అవసరం కాగా ఇప్పటివరకు 50 శాతం భూమిని సేకరించారు. దీనిలో కాలువల నిర్మాణం, ఇతర పనులు పూర్తిచేశారు. కాలువ నిర్మాణ పనులు పూర్తి చేసి లిఫ్ట్ ద్వారా మిగిలిన జలాలను తరలించేలా పథకాన్ని రూపొందించారు.

4.80 లక్షల ఎకరాలకు సాగునీరు

ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో 15 మెట్ట ప్రాంత మండలాల్లో 2.10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ఈ పథకం ముఖ్యోద్దేశం. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం గుడ్డిగూడెం ఎత్తిపోతల పథకాన్ని విస్తరించి చింతలపూడి పథకానికి అనుసంధానించింది. దీంతో ఆయా జిల్లాల్లో 4.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. దీనిలో 2.10 లక్షల ఎకరాల ఆయకట్టు కాగా కొత్తగా మరో 2.70 లక్షల ఎకరాల స్థిరీకరణ చేసి 53.50 టీఎంసీల గోదావరి నీటిని వాడుకునేలా కాలువల సామర్థ్యాన్ని పెంచనున్నారు. గోదావరి నీటిని ప్రధాన కాలువ నుంచి కృష్ణా జిల్లా వేంపాడు కాలువకు మళ్లిస్తారు. దీనికోసం రెండు జిల్లాల సరిహద్దులో చీపిరిగూడెం వద్ద తమ్మిలేరు కాలువపై చేపట్టిన అక్విడెక్ట్ నిర్మాణం పూర్తి కావచ్చింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యర్రగుంటపల్లి వద్ద నుంచి ఉమ్మడి కృష్ణా జిల్లా చాట్రాయి మండలం వేంపాడు కాలువ పొడవు 14 కిలోమీటర్లు కాగా ఇప్పటివరకూ 2.5 కిలోమీటర్ల తవ్వకం పనులు పూర్తయ్యాయి.

ప్రతిపాదనలకు అంగీకారం



నాబార్డు నుంచి రుణం తీసుకుని చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తాం. ఇప్పటికే ప్రతిపాదనలకు అంగీకారం రావడంతో ప్రాజెక్టు స్థితిగతులపై పరిశీలన చేసి సమస్యలు ప్రభుత్వానికి నివేదించాం. – వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

ఐసెట్‌లో అదరగొట్టారు

అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ



ఎండీ ఆఫ్తాబుద్దీన్ (6వ ర్యాంక్)



అంబళ్ల మహాలక్ష్మి (10వ ర్యాంక్)

చింతలపూడి/పోడూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్ టెస్ట్ (ఐసెట్)లో సత్తాచాటారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన ఎండీ ఆఫ్తాబుద్దీన్ రాష్ట్రస్థాయిలో 6, పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం కవిటంకు చెందిన అంబళ్ల మహాలక్ష్మి 10వ ర్యాంకుతో ప్రతిభ చాటారు. ఆఫ్తాబ్ తల్లి ఖాదర్‌బీబీ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఎంబీఏ చదివి ఐటీ రంగంలో ప్రొడక్ట్ మేనేజర్ కావాలన్నదే తన ఆశయమని ఆఫ్తాబ్ తెలిపాడు. పదో తరగతి వరకు చింతలపూడిలో, ఇంటర్ విజయవాడ, బీటెక్ కాకినాడలో చదివాడు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని..

కవిటానికి చెందిన మహాలక్ష్మి తండ్రి ఇంజనీర్ కాగా తల్లి శ్యామలాదేవి గృహిణి. ఆమె గతేడాది కూడా ఐసెట్‌లో 38వ ర్యాంకు సాధించింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో ఎంబీఏ చదవలేదు. అయితే మరలా ఎంబీఏ చదవాలనే ఉద్దేశంతో ఐసెట్ రాసి 10వ ర్యాంకుతో సత్తాచాటింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం తన లక్ష్యమని స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ద్వారా ఇన్‌కం ట్యాక్స్ సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించడం తన ఆశయమని చెప్పింది. మహాలక్ష్మి నానమ్మ అప్పాయమ్మ కవిటం గ్రామ మాజీ సర్పంచ్ కాగా తాత భాస్కరరావు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు.

జెడ్పీ ఆస్తుల పరిరక్షణకు చర్యలు



సమీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో): జిల్లాపరిషత్ ఆస్తులన్నింటినీ ప్రతి మండలంలోని రెవెన్యూ అధికారులతో సర్వే చేయించాలని, జెడ్పీ ఆస్తులను పరిరక్షించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. ఏలూరులోని జెడ్పీ చాంబర్‌లో గురువారం ఆస్తుల సెక్షన్ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇకపై జెడ్పీ ఆస్తులన్నింటినీ ఆయా మండలాల్లో ఎంపీడీఓలు పర్యవేక్షించేలా మార్గదర్శకాలు రూపొందిస్తున్నామన్నారు. ఆస్తుల సంరక్షణ కోసం ముగ్గురు ఉద్యోగులతో కూడిన బృందాలను ప్రతి మండలానికి పంపి పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, దానిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. సీఈఓ కేవీఎస్ ఆర్ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపేలా జగనన్న ఆణిముత్యాలు

మంత్రులు కొట్టు, కారుమూరి



తాడేపల్లిగూడెంలో పురస్కారాలు అందజేసిన మంత్రి కొట్టు సత్యనారాయణ



వేల్పూరులో జిల్లా టాపర్‌ను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడంతో పాటు ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద పురస్కారాలు అందజేస్తోందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్‌లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జగనన్న ఆణిముత్యాలు పురస్కారాలను ఆయన అందజేశారు. విద్యార్థులకు మెడల్స్‌తోపాటు నగదు ప్రోత్సాహకాలను అందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆణిముత్యాలుగా నిలవాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థుల చదువులకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని, కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పిస్తోందన్నారు. కొలుకులూరి ధర్మరాజు, కర్రి భాస్కరరావు, ముప్పిడి సంతప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలు వీరే..

ఇంటర్‌లో కూనపు దొరబాబు (ఆరుగొలను), వై.నాగదుర్గ (తాడేపల్లిగూడెం), షేక్ ఆయేషా (మాధవరం)కు రూ.15 వేల చొప్పున చెక్కులను మంత్రి కొట్టు అందజేశారు. పదో తరగతిలో బలరామకృష్ణ (తాడేపల్లిగూడెం), పండూరి గీతిక (తాడేపల్లిగూడెం), మాగంటి వరలక్ష్మి (తాళ్లముదునూరుపాడు)కు పురస్కారాలు అందజేశారు.

విద్యలో విప్లవాత్మక సంస్కరణలు

తణుకు టౌన్: ప్రభుత్వ విద్యారంగంలో సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం వేల్పూరులో జరిగిన జగనన్న ఆణిముత్యాలు జిల్లాస్థాయి కార్యక్రమంలో ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. డీఈఓ ఆర్.వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం విద్యా రంగం 14వ ర్యాంకులో ఉండగా ప్రస్తుతం మూడో స్థానంలో నిలిచిందన్నారు. పేదల విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పలు పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. నాడు–నేడులో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారీ బడుల్లో 9 రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో స్ఫూర్తి పొందడానికి, మరింత ఉత్సాహాన్ని చూపేందుకు వీలుగా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాఠశాల, నియోజకవర్గ, జిల్లాస్థాయిల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్నట్టు చెప్పారు. దీనిలో భాగంగా నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. టెన్త్‌లో జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఎండీ సబీనా (తణుకు), నడపన దుర్గ (అత్తిలి), కారుమూరి గణ కార్తీక్ (తణుకు), ఇంటర్‌లో ప్రతిభ చాటిన తణుకు ఎస్‌ఎంఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వెంకటసాయి, ఎస్.రాజు, కె.ప్రత్యూష, కె.శశిప్రసాద్‌ను మంత్రి కారుమూరి, కలెక్టర్ పి.ప్రశాంతి చేతులమీదుగా సత్కరించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్రా వీరన్న, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషకుమారి తదితరులు పాల్గొన్నారు.

చేపల పట్టుబడికి వెళ్లి తిరిగి వస్తూ..

- బొలెరో వ్యాన్ బోల్తా.. ఇద్దరి పరిస్థితి విషమం
- 15 మందికి గాయాలు





తీవ్ర గాయాలైన ఏసురాజు పరిస్థితిపై ఆరా తీస్తున్న పోలీసులు, వ్యాన్ టైర్ పగిలిన దృశ్యం

భీమవరం అర్బన్: చేపల పట్టుబడికి వెళ్లిన వలల కూలీలు తిరిగి వస్తుండగా బొలేరో వ్యాన్ బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండగా, మరో 15 మందికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మొగల్తూరు మండలం మోళ్లపర్రు గ్రామానికి చెందిన తిరుమాని సత్యనారాయణ, మరో 16 మంది వలల కూలీలు చేపల పట్టుబడికి బొలెరో వ్యాన్‌లో కాళ్ల మండలంలోని బొండాడ గ్రామానికి వెళ్లారు. అక్కడ చేపలు పట్టుబడి పట్టి తిరిగి అదే వ్యాన్‌లో మోళ్లపర్రు వస్తుండగా భీమవరం మండలం తోకతిప్ప గ్రామం వద్ద డ్రైవర్ అజాగ్రత్తతో వ్యాన్ టైరు పేలి వాహనం బోల్తా కొట్టింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను రెండు అంబులెన్స్‌లలో భీమవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వలల కూలీలు కొల్లాటి ఏసురాజు, కొక్కిలిగడ్డ సుబ్బారావు పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్టు తిరుమాని సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమవరం రూరల్ ఎస్సై బి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూసార పరిరక్షణతో అధిక దిగుబడులు



మట్టి నమూనాలు సేకరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

ఉండి: రైతులు భూసారాన్ని పరిరక్షిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఉండి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఆయన భూసార పరిరక్షణపై రైతులతో మాట్లాడారు. వరి పొలాల్లో మట్టి నమూనాల సేకరణ, ఆన్‌లైన్ చేసే విధానంపై క్షేత్రస్థాయిలో రైతు భరోసా కేంద్రం సిబ్బందికి అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణతో ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెరుగుతుందన్నారు. అధికారులు తప్పనిసరిగా రైతులకు మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించాలని సూచించారు. సరైన రీతిలో ఎరువుల యాజమాన్యం చేపడితే ఖర్చులు తగ్గి రైతులకు నష్టాలు రావన్నారు. అలాగే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు సంప్రదాయ పద్ధతులను అనుసరించి ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల భూసారం తగ్గడంతో పాటు సాగులో నష్టాలు తప్పవన్నారు. ఏడీఏ కేఎస్ ఎస్ శ్రీనివాసరావు, ఏఓ సంధ్య, రైతు భరోసా కేంద్ర సిబ్బంది జె.ఆల్‌ఫ్రెడ్, కె.పరంజ్యోతి, సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాడు–నేడు పనుల నాణ్యతపై తనిఖీలు

కలెక్టర్ ప్రశాంతి



వేల్పూరులో పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్

తణుకు టౌన్: నాడు–నేడు పథకంలో పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు ఆదేశించారు. గురువారం వేల్పూరులోని 1, 5 మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఆమె పరిశీలించారు. పాఠశాలల ఆవరణల్లో చెత్తాచెదారాలు పేరుకుపోవడం, అవసరానికి మించిన నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేయడం, అడిగిన ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చార్జి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఎలక్ట్రికల్ సామాన్లను నిర్ణయించిన ధరలకు స్థానికంగా కొనుగోలు చేయాలని సూచించారు. నాడు–నేడు పనుల్లో నాణ్యత లోపించినా, ఖర్చులో తేడా వచ్చినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యతగా పనులు చేపట్టాలని సూచించారు. జిల్లాలో నాడు–నేడు కింద చేపట్టిన పనులను ఆర్‌అండ్‌బీ అధికారులతో తనిఖీలు చేయిస్తామన్నారు. వారంలో రెండు రోజులు పాఠశాలలు, కళాశాలలు తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలని ఆర్ అండ్ బీ అధికారులకు ఆదేశించినట్టు చెప్పారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనుల వారీగా అప్‌డేట్ చేయాలని, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు వారంలో రెండు రోజులు పాఠశాలలు, కళాశాలల తనిఖీలు చేసి వాటిని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు ఉన్నారు.

20న ఆలయ ఉద్యోగుల సమావేశం

ద్వారకాతిరుమల: రాష్ట్ర దేవదాయ శాఖ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుపై చర్చించేందుకు ద్వారకాతిరుమల దేవస్థానంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఆలయాల ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు సమాఖ్య కార్యదర్శి రొంపిచర్ల హనుమంతాచార్యులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచిన విషయం తెలిసిందే. అయితే అది దేవదాయ శాఖ ఉద్యోగులకు వర్తింపచేయకపోవడంపై ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. దీనిపై చర్చించేందుకు సమావేశం నిర్వహించనున్నామని రొంపిచర్ల తెలిపారు.

క్లుప్తంగా

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య



యడ్లపల్లి సాయమ్మ మృతదేహం

జంగారెడ్డిగూడెం: భర్త, అతని కుటుంబసభ్యులు వేధింపుల కారణంగా ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన యడ్లపల్లి సాయి (సాయమ్మ)కు ఆరేళ్ల క్రితం పట్టణంలో డాంగే నగర్‌కు చెందిన యడ్లపల్లి విఘ్నేశ్వరరావుతో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం.. ఇటీవల విఘ్నేశ్వరరావు, ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య సాయమ్మను వేధిస్తున్నట్లు తెలిపారు. చాలాసార్లు సాయమ్మ కుటుంబసభ్యులు గొడవను సర్దుబాటు చేసినప్పటికీ విఘ్నేశ్వరరావు ప్రవర్తనలో మార్పు రాలేదు. సాయమ్మను మరింత వేధించడం మొదలుపెట్టాడు. దీంతో భర్త వేధింపులు తాళలేక గురువారం సాయమ్మ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సాయమ్మ ఆత్మహత్యకు భర్త, అతని కుటుంబసభ్యులు వేధింపులే కారణమని పేర్కొంటూ ఆమె సోదరుడు అబ్బదాసరి బద్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

18న ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 18న ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాల ఆవరణలో జూనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పోటీలు చేపట్టి ప్రతిభ చూపిన వారిని జట్లకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. 01-01-2005 తర్వాత పుట్టిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులు జులై 2 నుంచి నూజివీడులో జరిగే అంతర్రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గలవారు పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 94403-49534 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ఉప్పు రైతుకు కాసుల పంట

- ఈ ఏడాది రికార్డు స్థాయిలో దిగుబడి
- గిట్టుబాటు ధర పెరగడంతో రైతుల్లో ఆనందం

నరసాపురం: జిల్లాలోని నరసాపురం తీరంలో ఈ ఏడాది ఉప్పు సాగులో రికార్డు స్థాయిలో దిగుబడి వచ్చింది. ఫిబ్రవరి నుంచి సాగుకు అనుకూల వాతావరణం నెలకొనడంతో ఉప్పు రైతులు ఏ ఇబ్బంది లేకుండా సాగు చేసి మంచి దిగుబడి సాధించారు. మరోవైపు గిట్టుబాటు ధర కూడా పెరగడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత ఏడాది తుఫాన్‌లు, అకాల వర్షాలు వల్ల ఉప్పు రైతులు నష్టపోయారు. గతేడాది మే నెలలోనే తుఫాన్ రావడం, ఏప్రిల్ నుంచి జూన్ వరకూ అధిక వర్షాల కారణంగా ఉప్పు దిగుబడి భారీగా తగ్గింది. ఈ ఏడాది ప్రకృతి ఉప్పుసాగుకు పూర్తిగా అనుకూలించింది. ఫిబ్రవరి రెండో వారంలోనే ఉప్పు సాగు ప్రారంభం కాగా మార్చి ప్రారంభం నుంచి విస్తృతంగా సాగింది. ఎండలు విపరీతంగా ఉండటంతో దిగుబడులు పెరిగాయి. మే నెల ప్రారంభం నుంచి ఇంతవరకూ చూసుకుంటే ఈ 45 రోజుల్లోనే దాదాపు 2 వేల టన్నులు దిగుబడి సాధించినట్టు ఉప్పు రైతులు చెపుతున్నారు. సాధారణంగా ఏడాది మొత్తం ఇక్కడ తీరగ్రామాల్లో 6 వేల టన్నుల వరకూ ఉప్పు దిగుబడి ఉంటుంది. అలాంటిది ఈ 45 రోజుల్లోనే 2 వేలు టన్నులకుపైగా దిగుబడి వచ్చింది.



నరసాపురం మండలం పెదమైనవానిలంకలో మడుల్లో ఉప్పు పంట పండిస్తున్న దృశ్యం

1500 ఎకరాల్లో సాగు..

జిల్లాలో నరసాపురంలో 19 కిలోమీటర్లు ఉన్న తీర ప్రాంతంలో సుమారు 1,500 ఎకరాల్లో ఉప్పుసాగు చేపట్టారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని వేములదీవి, తూర్పుతాళ్లు, చినమైనవానిలంక, పెదమైనవానిలంక, పేరుపాలెం, కేపీపాలెం తదితర 8 గ్రామాల్లో ఉప్పుసాగు జరుగుతుంది. ఒక్కో ఉప్పుమడి నుంచి దాదాపు 6 నెలల వరకూ ఉప్పు ఉత్పత్తి చేస్తారు. ఒక్కో ఎకరానికి పెట్టుబడి రూ.15000 నుంచి రూ. 20 వేల వరకు అవుతుంది. కొన్నేళ్లుగా నష్టాల్లో సాగిన ఉప్పుసాగు ఈ ఏడాది లాభాల బాట పట్టింది.

పెరిగిన గిట్టుబాటు ధర...

ఇటీవల ఉప్పుకు గిట్టుబాటు ధర కూడా పెరగడంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఏడాది క్రితం తీరంలో పండించే ఉప్పు బస్తా(50కిలోలు) రైతుల వద్ద దళారులు రూ.100కు కొనేవారు. ప్రస్తుతం బస్తా రూ.300 పలుకుతోంది. గిట్టుబాటు ధర మూడు రెట్లు పెరిగిన ఆనందం కూడా రైతుల్లో ఉంది. నరసాపురం తీరం నుంచి ఉప్పు ఆంధ్రా, తెలంగాణాలలోని పలు ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. గోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఉప్పు సరఫరా అవుతుంది.

ఈ ఏడాది దిగుబడి బాగుంది

ఈ ఏడాది ఎండలు ఫిబ్రవరిలోనే ప్రారంభమయ్యాయి. అకాల వర్షాలు, తుఫాన్‌ల బెడద లేకపోవడంతో ఉప్పుసాగు ఆటంకం లేకుండా సాగింది. దిగుబడి బాగా పెరిగింది. గత ఏడాది అసలు సాగు సరిగా సాగలేదు. ఎండాకాలంలో వర్షాలు పడ్డాయి. దీంతో మడుల్లోకి నీరు చేరింది. అప్పటికే పండించిన ఉప్పును అయిన కాడికి అమ్మున్నాము. అన్నీ నష్టాలే మిగిలాయి. ఈ ఏడాది వాతావరణం అనుకూలించింది.

– తిరుమాని ఏసు, ఉప్పు రైతు, పీఎం లంక, నరసాపురం మండలం

గిట్టుబాటు ధరతో లాభాలు

50 కేజీల బస్తా రూ 300 పలుకుతోంది. గత సంవత్సరం వరకూ బస్తాకు రూ.100 మించి ఇచ్చేవారు కాదు. చప్పనీటి ప్రాంతాల్లో రొయ్యల చెరువులకు కూడా ఉప్పును ఉపయోగించడం వంటి కారణాలతో డిమాండ్ పెరిగింది. దిగుబడి కూడా పెరగడంతో ఈ ఏడాది కాస్త లాభాలు చూస్తున్నాం.

– అంద్రాజు దుర్గారావు, ఉప్పురైతు పీఎం లంక, నరసాపురం మండలం

లారీ ఢీకొని యువకుడి మృతి



ప్రమాదస్థలంలో విశ్వేశ్వర శ్రీనివాస్ మృతదేహం

పాలకొల్లు సెంట్రల్: పూలపల్లి బైపాస్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రావణం విశ్వేశ్వర శ్రీనివాస్ (36) అనే యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన విశ్వేశ్వర శ్రీనివాస్, రామచంద్రపురానికి చెందిన పేలగాని రమేష్‌లు గురువారం తెల్లవారుజామున అమలాపురం నుంచి భీమవరం బైక్‌పై వెళ్తున్నారు. పాలకొల్లు నుంచి భీమవరం వెళ్లే పూలపల్లి బైపాస్ రోడ్డులో వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో శ్రీనివాసు కిందపడగా అతనిపై నుంచి లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనకాల కూర్చున్న రమేష్ ఎడమవైపునకు పడడంతో ఎలాంటి గాయాలు కాలేదు. రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఏసుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

వృద్ధుల సంరక్షణా బాధ్యత వారసులదే

ఏలూరు(మెట్రో): వృద్ధుల సంరక్షణ బాధ్యత నుంచి వారసులు తప్పించుకోవాలనుకోవడం అమానుషం, చట్టరీత్యా నేరమని జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ ఫీల్డ్ అధికారి మద్దుల పుష్పాంజలి అన్నారు. ఏలూరులో గురువారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్జేవియర్ నగర్‌లోని సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించార. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా పుష్పాంజలి మాట్లాడుతూ వృద్ధులు శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు గురవుతున్నారని, వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రజలు, ప్రభుత్వానిదేనని అన్నారు. అసోసియేట్ రాష్ట్ర కార్యదర్శి కుకునూరి రామచంద్రరావు మాట్లాడుతూ వృద్ధుల శ్రేయస్సుకు కేంద్రం తీసుకొచ్చిన్న తల్లిదండ్రులు – పెద్దల పోషణ, సంక్షేమ చట్టం కాగితాలకే పరిమితం కావడంతో వృద్ధుల సమస్యలు తీరడం లేదని వాపోయారు. ఈ చట్ట ప్రకారం వృద్ధులు తమ సమస్యలను నేరుగా ఆర్డీఓ స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు. జిల్లాలో ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి వృద్ధులకు ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కమిటీ వేయాలని కలెక్టర్‌ను కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధుల కోసం వృద్ధ మిత్ర ఏర్పాటు చేసి వృద్ధుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రరావు, రాధా కృష్ణ, శివ రామ కృష్ణారావు, సత్యనారాయణ, డాక్టర్ ఎస్‌వీపీఎస్ ప్రసాద్, బి.సత్యనారాయణ, డి.భాస్కరరావు, వి.శేషగిరిరావు, కె.కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్‌లు

కాపు ద్రోహులతో దోస్తీనా?

పవన్ తీరుపై డిప్యూటీ సీఎం కొట్టు ఆగ్రహం

తాడేపల్లిగూడెం అర్బన్ : పవన్ కల్యాణ్ తన పద్ధతి మార్చుకోవాలని, లేకపోతే ఛీత్కారాలు తప్పవని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారాహి వాహనంపై నుంచి కత్తిపూడి సభలో పవన్ కల్యాణ్ చేసిన ప్రసంగం ఆద్యంతం సుద్దులను తలపించిందన్నారు. కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్న గోదావరి జిల్లాలకు వచ్చి ఆ కాపులనే తిట్టడం పవన్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. న్యాయపరంగా రిజర్వేషన్ కుదరదు కాబట్టే ఆనాడు జగ్గంపేట సభలో సాక్షాత్తూ జగన్ కాపు రిజర్వేషన్ సాధ్యం కాదని ధైర్యంగా చెప్పారని వివరించారు. జగన్ మాటలు నమ్మి కాపు జాతిలో 90 శాతం మంది 2019లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారని చెప్పారు. 2014లో నువ్వు వత్తాసు పలికిన చంద్రబాబు కాపు రిజర్వేషన్ ఇస్తానని నమ్మించి ఓట్లు వేయించుకుని మోసం చేశాడని గుర్తుచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ముద్రగడ కుటుంబంపై చిత్రహింసలు తెలియవా?

ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని చిత్రహింసలకు గురిచేసిన విషయం పవన్ కల్యాణ్‌కు తెలియదా అని మంత్రి కొట్టు ప్రశ్నించారు. చంద్రబాబు తన మనుషులతో రైలును తగులబెట్టించి ఆ నెపాన్ని కాపు ఉద్యమకారుల పైకి నెట్టి అక్రమ కేసులు బనాయించాడని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ కేసులను ఎత్తివేసి కాపు జాతికి మేలు చేశారని తెలిపారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలనుకోవడం పవన్ కల్యాణ్ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. కాపు సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి జగన్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అవి నీ బుర్రకు ఎక్కకపోవడం నీ అజ్ఞానానికి నిదర్శనం అంటూ ఘాటుగా విమర్శించారు.

కాపులకు అన్యాయం జరగడమే ఉద్దేశమా?

తెలుగుదేశంతో జత కట్టడం ద్వారా కాపులకు అన్యాయం జరగాలని పవన్ కల్యాణ్ కోరుకుంటున్నట్టు కనబడుతోందని మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఒకవైపు ముఖ్యమంత్రి అయ్యే సీన్ లేదంటూనే మరోవైపు అధికారంలోకి వస్తే అది చేస్తాను ఇది చేస్తాను అని చెప్పడం పవన్ కల్యాణ్ నిలకడ లేని మాటలకు నిదర్శనమన్నారు. పెళ్లి బీజేపీతో.. కాపురం చంద్రబాబుతో చేస్తావా అని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

చంద్రబాబు అవినీతిని నిలదీశావా?

చంద్రబాబు అవినీతిని ఏనాడైనా నిలదీశావా అని మంత్రి ప్రశ్నించారు. అవినీతి అనకొండ లాంటి చంద్రబాబు బంగారు కొండ లాగా కనిపిస్తున్నాడా అని మండిపడ్డారు. దమ్ముంటే జనంలోకి వచ్చి సంక్షేమ పథకాలు తప్పు అని మాట్లాడు.. ఆ జనమే నీకు తగిన గుణపాఠం చెబుతారు అని మంత్రి మండిపడ్డారు. చంద్రబాబుతో జతకట్టి కాపు సామాజిక వర్గానికి అన్యాయం చేసిన చరిత్రహీనుడిగా మిగిలిపోతావని ఉపముఖ్యమంత్రి హెచ్చరించారు.

నిడమానూరు చోరీ కేసులో ఐదుగురి అరెస్టు

394 గ్రాముల బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ వి.అజిత

విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని నిడమానూరులో ఈ నెల 9న తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎనికేపాడు సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.25 లక్షల విలువైన చేసే 394 గ్రాములు బంగారు ఆభరణాలు, ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను రూరల్ డీసీపీ డాక్టర్ వి.అజిత గురువారం వెల్లడించారు. ఆమె కథనం మేరకు.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూండెంనకు చెందిన పోలవరపు నాగదుర్గాప్రసాద్, భీమడోలుకు చెందిన తల్లిబోయిన నాగదుర్గారావు, ఏలూరు పవర్‌పేటకు చెందిన చిక్కాల రారాజు పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంనకు చెందిన ఎర్రసాని లక్ష్మణ్, గుత్తుల రవికుమార్ గతంలో వేర్వేరుగా అనేక చోరీలు చేసి జైలు జీవితం అనుభవించారు. జైల్లో ఉన్న రోజుల్లో వారు స్నేహితులయ్యారు. జైలు నుంచి విడుదలైన తరువాత అందరూ కలిసి ఎనికేపాడులో ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. జైలులో ఉండగానే నిర్ణయించుకున్న విధంగా అందరూ కలిసి పగటి సమయంలో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. దీనికి కావాల్సిన ఐదు బైక్‌లను దొంగిలించారు. ఈ నెల 9న నిడమానూరులో ఉంటున్న ఓ వ్యక్తి సొంతిల్లు కొనుగోలు చేసి గృహ ప్రవేశం నిమిత్తం ప్రస్తుతం ఉంటున్న ఇంటికి తాళం వేసి వెళ్లాడు. అప్పటికే చోరీ నిమిత్తం రెక్కీ నిర్వహిస్తున్న నిందితులు తాళాలు వేసిన ఆ ఇంటిని గుర్తించారు. ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించుకుని, ఈ నెల 9న ఇంటి వెనుక తలుపును బలంగా నెట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా పగులగొట్టి బంగారు ఆభరణాలు తీసుకుని అక్కడ నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాల ద్వారా గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎనికేపాడులో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఐదుగురిని సీసీఎస్ సీఐలు వై.రవికుమార్, పి.కృష్ణ తమ సిబ్బందితో కలిసి అదుపులోకి విచారించారు. ఆ విచారణలో నిందితులు చోరీ చేశామని అంగీకరించారు. ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో గతంలో పాల్పడిన చోరీలను కూడా అంగీకరించారు. నిడమానూరు చోరీ ఘటనలో పూర్తి సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని డీసీపీ అజిత అభినందించారు.

మీ పార్టీ ఏంటో మీకు గుర్తుందా పవన్ ?

అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ఎద్దేవా



తాడేపల్లిగూడెం: మీ పార్టీ ఏంటో మీకు గుర్తుందా పవన్ కల్యాణ్ అంటూ ప్రశ్నించారు అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం. పవన్ వైఖరిపై గురువారం తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడారు. మీ పార్టీ ఏంటి.. మీ పార్టీ గుర్తు ఏంటి.. మీ పార్టీ ప్రజలకు ఏం చేస్తుందనే విషయాలపై మీకు స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. మీకు మీరుగా పోటీ చేస్తారా.. తెలుగుదేశంతో కలిసి పోటీ చేస్తారా చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎన్నడూ లేని విధంగా కాపులపై కపట ప్రేమ చూపిస్తున్నారు. చంద్రబాబు హయాంలో ముద్రగడ కుటుంబానికి అన్యాయం జరిగినప్పుడు మీరు ప్రశ్నించారా.. వారి కుటుంబానికి బాసటగా నిలిచారా.. ముద్రగడ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టి చంద్రబాబు, లోకేష్ ఆనందపడుతుంటే మీరు ఎందుకు వారిని నిలువరించలేదు అంటూ నిలదీశారు. ముద్రగడకు మద్దతుగా కత్తిపూడి ప్రాంతంలో ధర్నాలు వంటివి ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. మంచి మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తుని సంఘటనలో కాపు యువతపై ఉన్న కేసులను రద్దు చేయించి వారి భవిష్యత్ నాశనం కాకుండా చూశారని అన్నారు. కాపులపై ఈ ప్రభుత్వానికి ఉన్న ప్రేమకు ఇదే నిదర్శనమన్నారు. ఎన్నికల సమయంలో మీకు కాపులు గుర్తుకు వచ్చి, వారిపై కపట ప్రేమ ప్రదర్శిస్తున్నారా అని నిలదీశారు. తుని ఘటనలో ముద్రగడ తదితరులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించిందని, మరి ఈ ఘటనకు కారకులెవరు? చంద్రబాబా, లోకేషా? మీరు పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం నవరత్న పథకాల ద్వారా కాపులతో పాటు అన్ని వర్గాలూ లబ్ధిపొందేలా చేస్తోందన్నారు. కోవిడ్ సమయంలో ప్రజా జీవనం అస్తవ్యస్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడిందని చెప్పారు. ఎమ్మెల్యేలు లేని, ప్రజాబలం లేని మీ లాంటి నాయకులు చెప్పులు చూపించినట్టుగా దిగజారి చూపించే సంస్కారం ఈ ప్రభుత్వంలో ఎవరికీ లేదన్నారు. ప్రజాసేవే పరమావధిగా జగన్ నాయకత్వంలోని ప్రభుత్వం పనిచేస్తుందనే విషయాన్ని గుర్తెరిగి పవన్ మాట్లాడితే మంచిది అని హితవు పలికారు.

18న ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘ సమావేశం

జంగారెడ్డిగూడెం: ఈ నెల 18వ తేదీన తాడేపల్లి ఇంకోలు కల్యాణమండపంలో ఆర్యవైశ్య సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ మాజీ ఉపాధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ (సీహెచ్‌ఆర్) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్యవైశ్యులకు జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో ప్రాతినిధ్యం, నామినేటెడ్ పదవులు, వివిధ మున్సిపల్, కార్పొరేషన్, పంచాయతీల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యంపై తీర్మానాలు, ఆర్యవైశ్య వ్యాపారస్తుల సమస్యలపై చర్చిస్తామన్నారు.

సుపరిపాలన, సమర్థ నాయకత్వంపై సదస్సు



ముంబైలో ఎమ్మెల్యేల సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: సుపరిపాలన, సమర్థ నాయకత్వంతో ప్రజాస్వామ్యం పటిష్టం వంటి అంశాలపై అఖిల భారతస్థాయిలో ఈ నెల 15 నుంచి 17 వరకూ ముంబైలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జాతీయస్థాయిలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గురువారం హాజరయ్యారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు, కౌన్సిళ్ల నుంచి సుమారు 2 వేల మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సదస్సుకు హాజరయ్యారని ఎమ్మెల్యే వాసుబాబు తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహిస్తున్న ఈ సమావేశంలో చట్టం, సుపరిపాలన, సమర్థ నాయకత్వం ఆవశ్యకత, శాంతి నిర్మాణం తదితర అంశాలపై అభిప్రాయాలను తెలియజేశారన్నారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు: మండలంలోని దర్శిపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పవన్.. ముందు లెక్కలు నేర్చుకో!

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: భీమవరం నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య కూడా తెలియని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ దొంగ ఓట్లు, రిగ్గింగ్ చేశారని మాట్లాడడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తీవ్రంగా మండిపడ్డారు. గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ పవన్ వ్యాఖ్యల పట్ల తీవ్రంగా ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో రెండుచోట్ల పోటీ చేసి ఓటమితో ఘోరపరాజయం పాలై ఏం మాట్లాడుతున్నారో తెలియడం లేదన్నారు. పవన్‌కల్యాణ్ ముందు లెక్కలు నేర్చుకోవాలని శ్రీనివాస్ హితవు చెప్పారు. భీమవరం నియోజకవర్గంలో 2.40 లక్షల మంది ఓటర్లు ఉంటే కేవలం లక్ష ఓట్లు మాత్రమే ఉన్నాయని చెబుతూ వాటిలో లక్షా 8 వేల ఓట్లు పోలయ్యాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. లక్ష ఓట్లు ఉంటే మిగిలినవన్నీ దొంగ ఓట్లు, రిగ్గింగ్ చేశారని పవన్ కల్యాణ్ మాట్లాడడం చూస్తుంటే ఆయనకు లెక్కలు తెలియవనే విషయం స్పష్టమైందని శ్రీనివాస్ వివరించారు. కనీసం లెక్కలు కూడా తెలియని వ్యక్తులు రాజకీయ పార్టీలు పెట్టి విద్య కోసం, పేదల కోసం ఎంతో చేస్తామని చెబుతుంటే వారిని నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు.

108 వాహనంలో ప్రసవం



చాట్రాయి : మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన పావని అనే గర్భిణికి బుధవారం రాత్రి 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. రాత్రి 10 గంటలకు పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి కాల్ చేశారు. వెంటనే 108 సిబ్బంది ఆమెను నూజివీడు ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలోనే మగబిడ్డకు జన్మనిచ్చినట్లు సిబ్బంది సులోచనరావు, విష్ణు తెలిపారు.

క్లుప్తంగా

స్కేటింగ్ క్రీడాకారులకు అభినందనలు



తణుకులో స్కేటింగ్ క్రీడాకారులతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: గుంటూరులో నిర్వహించిన ఓపెన్ ఏపీ స్టేట్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటిన తణుకు స్కేటింగ్ రేంజర్స్ అకాడమీ చిన్నారుల బృందం గురువారం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును కలిశారు. ఈ నెల 3,4 తేదీల్లో జరిగిన ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో పశ్చిమ గోదావరి జిల్లాకు రెండో స్థానం లభించగా పాల్గొన్న తణుకు క్రీడాకారులకు 22 బంగారు పతకాలు, 4 వెండి పతకాలు, 6 కాంస్య పతకాలు దక్కినట్లు కోచ్ లావణ్య మంత్రి కారుమూరికి వివరించారు. విజేతలైన చిన్నారులను మంత్రి కారుమూరి ప్రత్యేకంగా అభినందించారు.

సామూహిక నారుమడులను పరిశీలించిన ఏవో



కృష్ణాయపాలెం గ్రామంలో సామూహిక నారుమడులను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో రైతులంతా కలిసి వేసిన సామూహిక నారుమడులను గురువారం మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడి పోసి 15 రోజులు గడిచిన వాటిల్లో యూరియా వేసుకోవాలని సూచించారు. ఐదు సెంట్లకు మూడు కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈవో మాధవ వర్మ, వీఏఏ ఆంజనేయులు, వీఆర్వో రాంబాబు, రైతులు రామకృష్ణ, శివయ్య, సాయి, రత్తయ్య ఉన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటియూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు పర్మినెంట్ కార్మికులతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్స్‌కు రూ.18,500 జీతం, హెల్త్ అలవెన్స్‌లు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధనాల దానయ్య, కె.బాబు, ఎస్.సతీష్, అల్లం పద్మ, ధనరాజీలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

నిట్‌ను సందర్శించిన బీజేపీ నాయకులు



నిట్‌ను సందర్శించిన బీజేపీ నేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల సుపరిపాలన పూర్తైన సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ప్రాజెక్టులు సందర్శనలో భాగంగా బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు గురువారం జిల్లాలోని తాడేపల్లిగూడెం నిట్‌ను సందర్శించారు. నిట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ వీరేష్ కుమార్ నిట్ పురోగతిని, వివిధ విభాగాల పనితీరును బీజేపీ నాయకులకు వెల్లడించారు. మొదటి దశలో 550 కోట్లుతో మౌలిక వసతులు కల్పన జరిగిందని, సుమారు 750 కోట్లుతో రెండో దశ నిర్మాణ పనులకు ప్రభుత్వం అమోదం తెలిపిందని వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ, నాయకులు నరిస్సే సోమేశ్వరరావు, కోట రాంబాబు, పెదప్రోలు వీరరాఘవులు, అయినం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ బస్సుల సేవల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఫిర్యాదులు, సలహాలు సేకరించేందుకు శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి తెలిపారు. తణుకు డిపో పరిసర ప్రాంత ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకుని 99592 25484 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇంటింటా సంక్షేమ ఫలాలు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- గడపగడపకు మన ప్రభుత్వానికి విశేష స్పందన



దర్శిపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: అర్హులందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలు ఎల్లవేళలా అండగా ఉండే నాయకత్వాన్ని ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం రెండోరోజు సాయంత్రం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ పారదర్శకంగా పాలన అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలు అధికారం కోసం వైఎస్సార్ సీపీపై అభండాలు వేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో ప్రజలు చాలాఇబ్బందులు పడ్డారని తెలిపారు. నేడు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. టీడీపీ యాత్రతో పాటు, జనసేన చేపడుతున్న వారాహియాత్రను, ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగిస్తున్నారని, తిరిగి వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగనన్న మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. దర్శిపర్రు రామాలయ నిర్మాణానికి రూ. 70 లక్షలు అందించగా బిళ్లగుంట రామాలయానికి మరో 10 లక్షలు అందిస్తానని మంత్రి ఈ సందర్భంగా తెలపడంతో ఆయా కమిటీల సభ్యులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గుండుమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు, పార్టీ నాయకులు కైగాల శ్రీనివాస్, జామి కృష్ణ, గుండుమోగుల మునీంద్ర, ఉన్నమట్ల ఏసురత్నం, పార్టీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, సంపదరావు కృష్టారావు, మైలవరపు పెదబాబు, సొసైటీల అధ్యక్షులు బూరాడ శ్రీనివాస్, దేవ వెంకటరమణ, ములగాల రామసత్యనారాయణ, సర్పంచ్‌లు గొర్రెల కోటేశ్వరరావు, గేదల శివకుమార్, పునుకు పుల్లయ్య, మట్టా సత్యనారాయణ, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గూడెంలో విజిలెన్సు తనిఖీలు



తనిఖీలు చేస్తున్న విజిలెన్సు అధికారులు

తాడేపల్లిగూడెం: ఏలూరు రీజినల్ విజిలెన్సు, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి కరణం కుమార్ ఆదేశాల మేరకు గురువారం గూడెంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. పలు స్వీట్ షాపులను తనిఖీ చేశారు. ఒక షాపులో పైనాపిల్ కూల్‌కేక్ ,ఖాజు గులాబీ శాంపిల్స్ సేకరించారు. ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. మరో షాపులో ఎఫ్ఎస్ఎస్ఏఐ గడువు ముగిసింది. దీనికి వివరణ కోరుతూ నోటీసులు ఇచ్చారు. హల్వా, ఖాజా, శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. విజిలెన్సు అధికారులు యుజె.విల్సన్, ఫుడ్ ఇనస్పెక్టర్ సుందర్‌రామిరెడ్డి పాల్గొన్నారు.

ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అంగన్‌వాడీ టీచర్లు ఎం.సుజాత తెలిపారు. మండలంలోని వీరంపాలెం అంగన్‌వాడీ కేంద్రం నెం .113, 267 కేంద్రాల ఆధ్వర్యంలో జనభాగీదారి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూలు విద్యార్థులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న విద్య, పౌష్టికాహారం గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎం.పద్మావతి, వెంకటలక్ష్మి, సరస్వతి, ప్రీస్కూలు తల్లులు, పిల్లలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

బంగారుగూడెంలో జన్ భాగీరథి కార్యక్రమం

మండలంలోని బంగారుగూడెం గ్రామం అంగన్‌వాడీ కేంద్రం నెం.114, 115లో గురువారం జన్ భాగీరథి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, అంగన్‌వాడీ విద్య, పౌష్టికాహారం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎస్.చందు, టి.సుగుణ కుమారి, ప్రీస్కూలు తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఆటపాటలతో చిన్నారులకు విద్య

తణుకు టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో పాటు విద్య నేర్పించడంతో పాటు సృజనాత్మకతను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం అరుణ కుమారి చెప్పారు. గురువారం తణుకు పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన జన భాగీధార కార్యక్రమంలో బాగంగా 3, 4 సంవత్సరాల పిల్లల కోసం నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి ఆమె పిల్లల తల్లులకు వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అత్తిలి మండలం బల్లిపాడులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: రాష్ట్రంలో సంక్షేమపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం రాత్రి అత్తిలి మండలం గుమ్మంపాడు, బల్లిపాడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంకూడా అమలు చేయనటువంటి వినూత్నమైన సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విజయవంతంగా అమలు చేస్తూ, ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రజల సొమ్మును దోచుకుతిన్నారని, సంక్షేమపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు బురదజిమ్ముతున్నాయని మండిపడ్డారు. అర్హతే ప్రామాణికంగా కుల మత పార్టీలకు అతీతంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటి వద్దకే చేరుస్తున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్‌లు వంటి శాశ్వతమైన అభివృద్ధి పనులు చేస్తుంటే, ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీనాయకులు, కార్యకర్తలు, సమన్వయంతో పనిచేసి రానున్న రోజుల్లో తిరిగి పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో అభివృద్ధి పనులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్‌లు వేగేశ్న ధనసత్యనారాయణ రాజు, కసిరెడ్డి బాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు అద్దంకి శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల పండుస్వామి, ధనుమూరి తాతాజీ, గుబ్బల ఆంజనేయులు, మద్దాల శ్రీనివాస్, యాళ్ల సాధుసింగ్, పెన్మెత్స రంగరాజు, శింగంశెట్టి శ్రీనివాస్, అడ్డాల వెంకటరత్నంబాబు, రాయుడు ధర్మారావు, కొమ్మర రామారావు తదితరులు పాల్గొన్నారు.

చర్మకారుల సమస్యలను పరిష్కరించాలి



కడియద్ద గ్రామంలో చర్మకారుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: చర్మకారుల సమస్యలను పరిష్కరించాలని జగజ్జీవన్‌రామ్ చర్మకారుల కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కడియద్ద గ్రామంలో చర్మకారుల కార్మిక సంక్షేమ సంఘ సమావేశం జిల్లా అధ్యక్షుడు మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ చర్మకారుల సంక్షేమం, అభివృద్ధి సాధికారిత కోసం ఏర్పాటు చేసిన లిడ్‌క్యాప్‌ను పరిరక్షించాలని, రుణాలు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు మధుమంచి విజయ, తాడేపల్లిగూడెం నియోజకవర్గ అధ్యక్షుడు దూలపల్లి సత్తియ్య, పట్టణాధ్యక్షుడు నేలపాటి వెంకటకుమార్, మండల అధ్యక్షుడు ఉండ్రాజవరపు కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు జంపల్లి సుధాకర్, పెదతాడేపల్లి గ్రామ కార్యదర్శి శివుని కొండలు, కడియద్ద గ్రామ అధ్యక్షుడు గెద్దం సుందరరావు, చర్మకారులు పాల్గొన్నారు.

శ్రీ శ్రీ పుస్తకాలను ప్రతి ఒక్కరూ చదవాలి



శ్రీ శ్రీ చిత్రపటానికి నివాళ్లుర్పిస్తున్న సాహితీ సమాఖ్య సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సాహితీ వైతాళికుడు మహాకవి శ్రీ శ్రీ 40వ వర్ధంతి స్థానిక గ్రంథాలయంలో గురువారం రాత్రి జరిగింది. తెలుగు సాహితీ సమాఖ్య, శ్రీ శ్రీ కళా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని విశ్వ జనీనం చేసిన శ్రీ శ్రీ మహా ప్రస్థానం పుస్తకాన్ని విద్యార్థులు, ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చదవాలన్నారు. తెలుగు సాహిత్యానికి దశ దిశ నిర్దేశకుడిగా శ్రీ శ్రీ నిలిచారని ఎల్ఐసీ విశ్రాంత మేనేజర్ గరికిపాటి బాపయ్య శర్మ అన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ సమాఖ్య అధ్యక్షుడు కోపల్లె శ్రీనివాస్, కార్యదర్శి పైలు శ్రీనివాసరావు, శ్రీ శ్రీ కళా వేదిక జాతీయ కార్యదర్శి కొల్లి రమావతి, బడుగు చంద్రశేఖర్, శ్యామ్యూల్ రాజు, ప్రత్తి వీరాస్వామి, సాహితీ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య సంస్థ వారిచే స్కిల్ హబ్‌ను పట్టణంలోని వాసవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు, ఉచిత ఉపాధి కల్పన కోర్సులలో శిక్షణ అందిస్తున్నట్లు స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా ఆఫీసర్ ఎ.కృష్ణారెడ్డి తెలిపారు. 18 సంవత్సరాలు వయస్సు నుంచి 30 సంవత్సరాలు వయస్సు కలిగి, పదో తరగతి నుంచి పై చదువులు చదివిన వారు అర్హులన్నారు. శిక్షణా కాలం 2 నుంచి 3 నెలలు ఉంటుందని, శిక్షణ అనంతరం కోర్సు కంప్లీషన్ సర్టిఫికెట్స్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు, సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ డి.ప్రసన్న 70138 96277కు కాల్ చేయాలన్నారు.

153 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు



తేతలిలో ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు పట్టణంలోని ఆర్ ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలకొల్లు లయన్స్ కంటి ఆసుపత్రి నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 153 మంది ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. తేతలి ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ వంకా రాజకుమారి ప్రారంభించారు. ఈ శిబిరంలో తేతలి ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని వివిధ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు 153 మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 8 మందికి కంటి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. 38 మందికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. డాక్టర్ లక్ష్మీపతిరాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పానకాల బలుసులమ్మకు ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయం అభివృద్ధి పనులలో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న పానకాల బలుసులమ్మ అమ్మవారి విగ్రహ జీర్ణోద్ధరణ కార్యక్రమం గురువారం పండితులు బాదంపూడి ఫణిశర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు వెలవలపల్లి గోపినాథ్ శర్మ, బాదంపూడి మల్లిఖార్జున శర్మలచే నిర్వహించారు. హోమాలు, పూజలు అనంతరం అమ్మవారిని గర్భగుడిలో ప్రతిష్ఠించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొట్టు రామాంజనేయులు, సభ్యులు పర్యవేక్షించారు.

వృద్ధులపై వేధింపులు నివారించాలి



తహసీల్దార్ కార్యాయం వద్ద నిరసన చేపట్టిన వృద్ధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వృద్ధులపై వేధింపులు నివారించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలువురు సీనియర్ సిటిజన్స్ పేర్కొన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద వృద్ధులను కాపాడాలని కోరుతూ ర్యాలీ, నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వృద్ధుల పట్ల వేధింపులు, దూషణ, నిర్లక్ష్యం, శారీరక, మానసిక, ఆర్థిక దుర్వినియోగం వంటి వివిధ రూపాల్లో జరుగుతున్న దాడులపై వృద్ధులకు భద్రత కల్పించాలని కోరారు. అంతేగాక ఫారం 16ను ఇన్‌కం ట్యాక్స్ పరిధిలోకి వచ్చే పెన్షనర్స్‌కు అందజేశారు. సీనియర్ సిటిజన్స్ బి.హరిబాబు, కె.బాలకృష్ణ, వీరారావు, గంగయ్య, గరికిపాటి సుబ్రహ్మణ్య శర్మ

ప్రాణరక్షణకు హెల్మెట్ తప్పనిసరి



హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: ప్రాణరక్షణకు వాహనదారులు హెల్మెట్ ధరించాలని తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చినతాడేపల్లి అండర్ పాస్ వద్ద వాహనదారులకు హెల్మెట్, దిశా యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విధిగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు. అలాగే ప్రతి మహిళ చేతిలో రక్షణ దిశా యాప్ అని, యువతులు, మహిళలు తమ స్మార్ట్ ఫోన్లలో దిశా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మూర్తి, ఎస్సై వీఎస్.వీరభద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారత్-ఆస్ట్రేలియాల మధ్య బలమైన మైత్రి



ప్రవాస భారతీయుడు, శాస్త్రవేత్త నడింపల్లి కృష్ణను సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

తణుకు టౌన్: కోవిడ్ 19 అనంతరం ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన మార్పుల్లో భారత్- ఆస్ట్రేలియా దేశాల మధ్య స్నేహ సంబంధాలు పెరిగాయని ప్రవాస భారతీయుడు, జియోసైన్స్ ఆస్ట్రేలియా ప్రకృతివిపత్తుల నివారణ సంస్థ శాస్త్రవేత్త నడింపల్లి కృష్ణ చెప్పారు. గురువారం తణుకు రోటరీ క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడు బసవ రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నడింపల్లి కృష్ణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. గత 40 ఏళ్ల కాలంలో ఆస్ట్రేలియాలో భారత్ పర్యటించడం ప్రధాని మోదీయేనన్నారు. ఈ పర్యటన ద్వారా భారత్, ఆస్ట్రేలియా సంబంధాలు మరింత పెరుగుతాయని చెప్పారు. ముఖ్యంగా వాణిజ్య వ్యవహారాల్లో ఆస్ట్రేలియాకు భారత్ మంచి బాగస్వామి అని చెప్పారు. విద్యా రంగంలో భారత్ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు ఆస్ట్రేలియా కలిస్తుందని చెప్పారు. రోటరీ కార్యదర్శి జీ సుధాకర్, సీనియర్ రొటేరియన్ మల్లిన రామచంద్రరావు, నందిగం సుధాకర్, జేఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తేతలిలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకు మండలంలోని ముద్దాపురం, దువ్వ, తేతలి, మండపాక, వేల్పూరు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందించిన జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్ల పాలనా కాలంలో సంక్షేమ పథకాల కోసం రూ. 2 లక్షల 16 వేల కోట్లను ఖర్చు చేయగా వాటిలో విద్యారంగానికి రూ. 68 వేల కోట్లను ఖర్చు చేయడం జరిగిందన్నారు. నాడు-నేడు పథకంలో బాగంగా రాష్ట్రంలోని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన బైజూస్ యాప్‌తో విద్యా భోధన దేశంలో ఒక్క మనరాష్ట్రంలోనే జరుగుతుందన్నారు. దీనికి ప్రైవేట్ పాఠశాలలో 6 నెలలకు రూ. 60 వేలు వసూలు చేస్తున్నారని, అటువంటి విద్యను ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో నాడు-నేడు పథకంలో 9 రకాల మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటిలో ఒక సభ్యుడుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారని అన్నారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఎంపీపీ రుద్ర ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీ గారపాటి పద్మజ, శేసెట్టి శేషుకుమారి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, వేల్పూరు సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, గ్రామ సర్పంచ్‌లు మజ్జి పద్మ, అడ్డా బాబు, సరెళ్ల కాంతి ప్రియ, జానా వెంకట లక్ష్మీ, నాయకులు కోట నాగేశ్వరరావు, ముళ్లపూడి బాబూరావు, నున్న దుర్గా ప్రసాద్, సరెళ్ల వీరతాత, రామకృష్ణంరాజు, లతో పాటు ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అధ్యక్షులు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.